
సాక్షి పశ్చిమగోదావరి

సోమవారం । 27 । మే । 2024



బ్రహ్మోత్సవ శోభ
జంగారెడ్డిగూడెంలోని పారిజాతగిరిలో శ్రీవారి బ్రహ్మోత్సవాలను ఈనెల 28 నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. 8లో



కొబ్బరిపువ్వుతో జీవనోపాధి
పాలకొల్లులోని క్షీరారామలింగేశ్వరస్వామి (క్షీరారామం) ఆలయ ప్రాంతంలో కొబ్బరి పువ్వు విక్రయిస్తూ చిరువ్యాపారులు జీవనోపాధి పొందుతున్నారు. 8లో



వేసవి దుక్కులతో మేలు
మెట్ట ప్రాంతాల్లో వర్షాధార పంటలు పండించే భూములన్నింటిలో వేసవి (లోతు) దుక్కులు మేలు చేస్తాయని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

ఆటో డ్రైవర్ నిజాయతీ



మహిళకు బ్యాగ్ అందిస్తున్న దృశ్యం

వీరవాసరం: చైతన్య యూనియన్ అమృత పాయింట్ సభ్యుడు, ఆటో డ్రైవర్ సూరి పెనుగొండ వెళ్లి వస్తుండగా నవుడూరు నుంచి వీరవాసరం మధ్యలో ఆటో ఎక్కిన నాగ దుర్గాభవానీ అనే మహిళ బ్యాగ్ మరిచిపోయింది. దీనిపై ఆమె వీరవాసరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుగా చేయగా ఎస్సై విచారణ చేస్తుండగా.. ఆటో డ్రైవర్ సూరి బ్యాగును తీసుకువచ్చారు. భీమవరం ట్రాఫిక్ ఏఎస్సై చేతులమీదుగా యూనియన్ ప్రెసిడెంట్ చెన్నంశెట్టి శ్రీనివాస్ ఆమెకు బ్యాగు అందజేశారు. బ్యాగులో మూడు కాసుల బంగారం, రూ.2,500 నగదు, బట్టలు ఉన్నాయి. నిజాయతీ చూపిన ఆటో డ్రైవర్ సూరిని పోలీసులు అభినందించారు.

నో ఫ్లయింగ్ జోన్‌గా కౌంటింగ్ కేంద్రం

ఉండి : నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరిగే భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలను నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య ప్రకటనలో తెలిపారు. మానవ రహిత వైమానిక వాహనాలు (యుఏవీ), డ్రోన్‌లు, బెలూన్లు మొదలైన వాటితో సహా ఎలాంటి విమానయాన పరికరాలను ఎగురవేయడం నిషేధమన్నారు. కేంద్ర ఎన్నికల సంఘ ఆదేశాల మేరకు జూన్ 4న ఓట్ల లెక్కింపునకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశామన్నారు. ముందు జాగ్రత్త చర్యగా కౌంటింగ్ హాళ్లు, కళాశాల ప్రాంగణమంతా నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించామన్నారు.

28న ఆల్ ఇండియా ఓపెన్ చెస్ పోటీలు

నరసాపురం: ఏపీ చెస్ అసోసియేషన్, మాస్టర్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నూలిపాయి అభయ్ స్మారక ఆల్ ఇండియా చెస్ పోటీలు ఈనెల 28న పట్టణంలోని అల్లూరి సాంస్కృతి కేంద్రంలో నిర్వహించనున్నట్టు అభయ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు నూలి శ్రీనివాస్ తెలిపారు. దేశంలోని పలు ప్రాంతాలకు చెందిన 500 మంది క్రీడాకారులు పాల్గొంటారని, విజేతలకు రూ.64 వేలు ప్రైజ్ మనీగా అందిస్తామన్నారు. ఏడేళ్లుగా తమ ట్రస్టు ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో చెస్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని వివరించారు.

ఉపాధి ముమ్మరం

జోరుగా ఉపాధి పనులు
- రోజుకు 48 వేల మందికి పనులు
- రూ.300కు పెరిగిన వేతనం
- రూ.37.42 కోట్ల వేతనాల చెల్లింపు
- పూడికతీత, తూడు తొలగింపు పనులు



తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులో చెరువు పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

భీమవరం (ప్రకాశం చౌక్) : పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలోని 20 మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి. వ్యవసాయ పనులు ముగిసిన నేపథ్యంలో కూలీలకు ఉపాధి కల్పించడంలో భాగంగా అధికారులు పనులు చేయిస్తున్నారు. కాలువలను కట్టివేయడంతో వ్యవసాయానికి ఊతమిచ్చేలా పంట బోదెలు, పంట కాలువల పూడికతీత పనులు, తూడు తొలగింపు పనులు చేస్తున్నారు. అలాగే ఖాళీ అయిన మంచినీటి చెరువుల్లో కూడా పూడికతీత పనులను కూలీలు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 20 మండలాల్లో రోజుకు 48 వేల మంది కూలీలు ఉపాధి పనులకు హాజరవుతున్నారు. గతంలో రోజుకు రూ.270 వేతనం చెల్లించగా ప్రస్తుతం ఉపాధి కూలీకి వేతనం రూ.300 చొప్పున అందిస్తున్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబం నుంచి కూలీలు ఉపాధి పనులకు వస్తున్నారు.

రైతులకు మేలు చేసేలా..

ఉపాధి హామీ పథకం పనులతో రైతులకు మేలు జరుగుతుంది. పంట బోదెలు, పంట కాలువలు పూడుకుపోవడం, తూడు చెత్తాచెదారంతో అధ్వానంగా ఉండటంతో సాగునీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. శివారు ఆయకట్టుకు సాగునీరు అందడంలో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి కూలీలతో పంట బోదెలు, కాలువలను బాగు చేయించడం ద్వారా ఖరీఫ్ సాగుకు సాగునీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకున్నారు. దీనిపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే గ్రామాల్లో చెరువులు బాగు చేస్తున్నారు. జిల్లాలో చిన్నపాటి పంట కాలువలు సుమారు 200కుపైగా ఉన్నాయి. అలాగే జిల్లాలో 2.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పంట బోదెలు సుమారు 800 నుంచి 900 వరకు ఉన్నాయి.

ఉపాధి హామీ పథకం పనులు

జిల్లాలో జాబ్‌కార్డులు	1,78,669
యాక్టివ్‌గా ఉన్న జాబ్‌కార్డులు	71, 784
కూలీల సంఖ్య	2,92,058
పనులు చేస్తున్న కూలీలు	1,00,582
ఉపాధి పనుల లక్ష్యం	43 లక్షల పని దినాలు
ఇప్పటివరకు పనుల కల్పన	20 లక్షల పని దినాలు

రూ.37.42 కోట్ల వేతనాలు చెల్లింపు

2024–25 సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు సుమారు 20 లక్షల పనిదినాలు కల్పించగా వేతనాల రూపంలో కూలీలకు రూ.37.42 కోట్లు చెల్లించారు. అలాగే వివిధ రకాల పనుల్లో ఉపయోగించిన మెటీరియల్‌కు రూ.45.98 కోట్లు అందించారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికీ వంద రోజులు పని దినాలు కల్పించాల్సిన నేపథ్యంలో ఇప్పటివరకు జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి 20 రోజుల పాటు పనులు కల్పించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో 7,06,364 మంది కూలీలు, ఈ నెలలో ఇప్పటివరకు 6,89,062 మంది కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించారు.

జిల్లావ్యాప్తంగా ఉపాధి పనులు

జిల్లాలోని 20 మండలాల్లో అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్నాయి. ఉపాధి పనులకు సీజన్ కావడంతో రోజుకు జిల్లాలో 48 వేల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు. ఈ ఏడాది లక్ష్యం 43 లక్షల పనిదినాలు కాగా జూన్ నెలాఖరు నాటికి 30 లక్షల పనిదినాలు లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటివరకు సుమారు 20 లక్షల పనిదినాలు కల్పించాం. జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికీ పని చూపించేలా చర్యలు తీసుకున్నాం. గతంలో రోజుకు వేతనం రూ.270 ఉంటే రూ.30 పెరిగి ఇప్పుడు రూ.300 చొప్పున చెల్లిస్తున్నాం.

–ఎం.ప్రభాకర్, డ్వామా పీడీ, భీమవరం

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : దేశంలోని 23 ప్రతిష్టాత్మక ఐఐటీ విద్యాసంస్థల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల నిమిత్తం జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహించారు. గత జనవరిలో జేఈఈ మెయిన్స్ మొదటి విడత, ఏప్రిల్‌లో రెండో విడత పరీక్షలు జరిగాయి. ఆయా పరీక్షల్లో నిర్దేశిత పర్సంటైల్ సాధించిన విద్యార్థులు మాత్రమే జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. వీరికి ఆదివారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో రెండు పేపర్లుగా పరీక్షలు నిర్వహించారు. ఏలూరులోని సిద్ధార్థ క్వెస్ట్, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలల్లో పరీక్షలు జరిగాయి. సిద్ధార్థ క్వెస్ట్‌లో 180 మందికి 178 మంది, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో 80 మందికి 79 మంది హాజరయ్యారు. మొత్తంగా 260 మందికి 257 మంది హాజరయ్యారు.

ట్రిపుల్‌ఐటీలో ఎన్‌సీసీ శిక్షణ

నూజివీడు : నూజివీడు ట్రిపుల్‌ఐటీలో ఎన్‌సీసీ 17వ ఆంధ్రా బెటాలియన్, విజయవాడ వార్షిక శిక్షణ శిబిరం ఆదివారం మూడో రోజు కొనసాగింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలకు చెందిన 650 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. క్యాంపు కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ ఎన్.సురేంద్రన్ మాట్లాడుతూ క్యాడెట్ల శారీరక దృఢత్వాన్ని పెంపొందించేలా శిక్షణ ఇస్తున్నామని, మానసిక వికాసానికి శిక్షణ దోహదపడుతుందన్నారు. ఉదయం, సాయంత్రం డ్రిల్‌లో శిక్షణ ఇవ్వడం, ఫైరింగ్, ఆటలు, మ్యాప్ రీడింగ్, శత్రు శిబిరాల పరిశోధన, ఆత్మ రక్షణ, నాయకత్వ లక్షణాలు, సైనిక విషయాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

కాళ్లకూరులో ముగిసిన కల్యాణోత్సవాలు



కాళ్లకూరులో స్వామి వారిని ఊరేగిస్తున్న దృశ్యం

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో స్వయంభూః శ్రీ వేంకటేశ్వరస్వామి (వెంకన్న) ఆలయంలో వార్షిక తిరు కల్యాణోత్సవాలు ఆదివారం జరిగిన విశేష కార్యక్రమాలతో పరిసమాప్తమయ్యాయి. చివరి రోజు స్వామి అమ్మవార్లకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, చక్రాబ్ది మండలార్చన, శ్రీ పుష్పయాగోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ద్వాదశ ప్రదక్షిణలు, ద్వాదశ నివేదనలు సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు భీమవరానికి చెందిన ఓ భక్తురాలు ఇత్తడి కుంకుమ భరిణెలు, జాకెట్ ముక్కలు పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్ కీలకం

కలెక్టర్ సుమిత్‌కుమార్



భీమవరం (ప్రకాశంచౌక్): పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కీలకమని, ఓట్ల లెక్కింపునకు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా అభ్యర్థులు, వారి ఏజెంట్లు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. వచ్చేనెల 4న జిల్లాలోని రెండు కేంద్రాల్లో ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని, మొదట పార్లమెంట్ నియోజకవర్గం, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కార్యక్రమం ఉంటుందని, అనంతరం ఏడు నియోజకవర్గాల కౌంటింగ్ హాళ్లలో ఈవీఎంల ఓట్ల లెక్కింపు చేపడతామన్నారు. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు 15 టేబుళ్లను, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి నాలుగు టేబుళ్లలో కౌంటింగ్ జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి గతంలో ఉన్న ఉత్తర్వులను అన్ని రాజకీయ పార్టీల అభ్యర్థన మేరకు కొంత వెసులుబాటు కల్పిస్తూ సవరణలతో మే 25న మరో ఉత్తర్వులను ఎన్నికల కమిషన్ విడుదల చేసిందన్నారు. ఓట్ల లెక్కింపులో రిటర్నింగ్ అధికారులదే తుది నిర్ణయమన్నారు. ఒక్కో టేబుల్‌కు 500 చొప్పున పోస్టల్ బ్యాలెట్లు ఇస్తామన్నారు. అలాగే పార్లమెంటు రిటర్నింగ్ అధికారి వద్దనే సర్వీసు ఓటర్లకు సంబంధించి ఎలక్ట్రానిక్ పోస్టల్ బ్యాలెట్ (ఈటీపీబీఎస్) లను కూడా లెక్కిస్తామన్నారు.

14 టేబుళ్ల చొప్పున..

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్ల ఏర్పాటు చేస్తున్నామని, స్ట్రాంగ్ రూముల నుంచి 14 కంట్రోల్ యూనిట్లను తీసుకువస్తామని అన్ని టేబుళ్లలో ఓట్ల లెక్కింపు పూర్తయ్యాక ఒక రౌండ్ పూర్తయినట్లుగా ఫలితాన్ని ఆర్వో ప్రకటిస్తారని కలెక్టర్ తెలిపారు. అభ్యంతరాలు ఉంటే వెంటనే చెప్పాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు గాని లేదా ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. విజేతల ఊరేగింపు, ర్యాలీలు, డీజే సౌండ్స్‌కు అనుమతి లేదన్నారు. నిబంధనలు మీరితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు కౌంటింగ్ సెంటర్‌కు ఉదయం 7 గంటలలోపు చేరుకోవాలన్నారు. పార్టీల ప్రతినిధులు, ఏజెంట్లు ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రానికి వచ్చేవారు మత్తు పానీయాలు సేవించరాదన్నారు. విజయం సాధించిన అభ్యర్థులు ఇతర అభ్యర్థులను ఉద్దేశించి కించపరుస్తూ మాట్లాడరాదన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత ఏజెంట్లను కౌంటింగ్ హాల్ నుంచి బయటకు పంపేందుకు రిటర్నింగ్ అధికారికి సర్వహక్కులూ ఉన్నాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు.

చింత చిగురు.. నోరూరు

ఆరోగ్య ప్రయోజనాలెన్నో..
- చింత చిగురుకు యమ డిమాండ్
- పుష్కలంగా పోషకాలు
- కిలో ధర రూ.1,000
- చిగురు లభ్యతకు అనువైన కాలం
- ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిగురు సేకరణ



కైకలూరు సమీపంలో చింత చిగురు విక్రయిస్తున్న దృశ్యం



చింత చిగురు

కైకలూరు: పచ్చబంగారంలా చిటారు కొమ్మన మిలమిల మెరిసే చింత చిగురును తింటే ఆరోగ్యంపై చింత అవసరం లేదంటారు పెద్దలు. నోటికి పుల్లడి రుచి ఇస్తూనే.. తినేకొద్దీ తినాలపిస్తుంది. చింత చిగురుకు కొల్లేరు రొయ్యలు, చేపలకు దట్టిస్తే.. ఇక భోజన ప్రియులకు పండగే. పులుపులో చింత చిగురుకు మరీ డిమాండ్. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో చిగురుతో వండిన చేప, రొయ్య, కోడి, వేట వంటి మాంసాహార కూరలను అందరూ లొట్టలేసుకోవాల్సిందే. ఈ సీజన్‌లో లేలేత చింత చిగురు అందుబాటులోకి వచ్చింది. పల్లెటూర్ల నుంచి మహిళలు చింత చిగురును తీసుకువచ్చి పట్టణాల్లో విక్రయిస్తున్నారు. చింత చిగురులో పలు పోషకాహారాలు మెండుగా ఉండటంతో అధిక ధర పలుకుతున్నా దీనికి డిమాండ్ బాగుంది.

ఇదే సీజన్‌లో..

చైత్రమాసం దాటిన వెంటనే చింత చెట్లకు చిగురు అందుబాటులోకి వస్తోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బుట్టయగూడెం, నూజివీడు, పాలకొల్లు, నరసాపురం, కై కలూరు, నూజివీడు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, దెందులూరు, చింతలపూడి నియోజకవర్గాల్లో చింత చిగురు అందుబాటులో ఉంది. కైకలూరు నియోజకవర్గంలో గోపాలపురం, వెంకటాపురం, పరసావానిపాలెం, చిగురుకోట, వడాలి గ్రామాల నుంచి చింత చిగురును తీసుకొచ్చి కైకలూరు పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ధర విషయానికి వస్తే 100 గ్రాములు రూ.100కి విక్రయిస్తున్నారు. ఇతర ప్రాంతాలకు ఆర్డర్లను బట్టి సరఫరా చేస్తున్నారు. చెట్లు తగ్గిపోవడంతో గతంలో కంటే చిగురు ఎక్కువగా లభించడం లేదని గోపాలపురం గ్రామానికి చెందిన విక్రయ మహిళ వాకాని శకుంతల 'సాక్షి'కి తెలిపారు.



గోపాలపురంలో చింత చెట్టు నుంచి చిగురును సేకరిస్తున్న మహిళ

ఆహా ఏమి రుచి..

శాకాహార, మాంసాహార కూరలకు చింత చిగురును దట్టిస్తే ఆ రుచే వేరుగా ఉంటుంది. కొల్లేరు పరిసర ప్రాంతాల్లో చింత చిగురుతో చేసిన వంటకాలు ప్రత్యేక డిష్‌గా గుర్తింపు పొందుతున్నాయి. శాకాహార, మాంసాహారాల్లో పలురకాలుగా చింత చిగురుతో వంటకాలు చేస్తారు.

పోషకాల గని

చింత చిగురులో ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు ఉన్నాయి. 100 గ్రాముల చిగురులో 5.8 గ్రాముల ప్రొటీన్లు, 10.06 గ్రాముల పీచు పదార్థం, 100 మిల్లీగ్రాముల కాల్షియం, 140 మిల్లీగ్రాముల పాస్ఫరస్, 26 మిల్లీగ్రాముల మెగ్నీషియం, విటమిన్ 'సి' 3 మిల్లీ గ్రాములు ఉంటాయి. ఇండియన్ జర్నల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కూడా చింత చిగురుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని ప్రకటించింది.

ఉపయోగాలివీ..
- చింత చిగురులో ఉన్న ఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి.
- శరీరంలో ఎర్రరక్త కణాల ఉత్పత్తికి అవసరమైన పోషకాలను అందించి, రక్తాన్ని శుద్ధి చేస్తుంది.
- యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. చిగురును ఉడికించి నీటిని పుక్కిలిస్తే గొంతు నొప్పి, మంట, వాపు, నోటి పూత తగ్గుతాయి.
- చింత చిగురులో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.
- మలబద్ధకం సమస్య తొలగిపోతుంది.
- పైల్స్ నివారణకు ఉపయోగపడుతుంది.
- వైరల్ ఇన్ఫెక్షన్లతో వచ్చే జ్వరాన్ని తగ్గిస్తుంది.
- గుండె జబ్బులు రాకుండా చూస్తుంది.
- నులి పురుగుల సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు చింత చిగురు ఔషధంగా పనిచేస్తుంది.
- జీర్ణాశయ సంబంధ సమస్యలను తగ్గిస్తుంది.
- విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండటంతో రోగ నిరోధక శక్తిగా పనిచేస్తుంది.
- ఎముకల దృఢత్వం, థైరాయిడ్ నివారణకు దోహదపడుతుంది.
- షుగర్ వ్యాధిగ్రస్తుల్లో చక్కెర స్థాయిలను తగ్గిస్తుంది.
- కీళ్ల వాపుల నివారణ, మలేరియా నుంచి ఉపశమనాన్ని కలిగిస్తుంది.
- తల్లిపాలను మెరుగుపరుస్తుంది.

100 గ్రాములు రూ.100



చింత చెట్లు పూర్వం రహదారుల వెంబడి కనిపించేవి. ఏటా జూన్, జూలై నెలల్లో ఎక్కువగా చింత చిగురును విక్రయించేవాళ్లం. ఇప్పుడు రోడ్ల వెడల్పు చేయడంతో చాలా చెట్లను తొలగించారు. కొన్నిచోట్ల మాత్రమే చింత చెట్లు కనిపిస్తున్నాయి. పలువురు వైద్యం కోసం అని చెప్పి మా వద్ద చింత చిగురు కొంటున్నారు. ప్రస్తుతం 100 గ్రాముల చిగురును రూ.100 ధరకు విక్రయిస్తున్నాం.

–వి.మంగమ్మ, ఆకుకూరల విక్రయదారు, గోపాలపురం

చింత చెట్లను పెంచాలి



చింత చెట్లను తొలగించిన ప్రాంతాల్లో మరో చెట్టును నాటాలి. పట్టణీకరణతో చాలా చెట్లు తొలగిస్తున్నారు. ఆకుకూరలకు కలిదిండి మండలం గోపాలపురం గ్రామం పేరు. మా కుటుంబం చింత చిగురును విక్రయిస్తోంది. చిగురును సేకరించడం అంతు సులువైన పనికాదు. చింత చెట్లను పెంచే విధంగా అందరికీ అవగాహన కలిగించాలి. చింత చిగురుతో లాభాలెన్నో ఉన్నాయి.

– వాకాని నాగ సుబ్రహ్మణ్యం, ఉప సర్పంచ్, గోపాలపురం

శ్రీనివాసా.. గోవింద



అనివేటి మండపంలో కోలాట నృత్యాలు చేస్తున్న భజన మండళ్ల సభ్యులు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వేసవి సెలవులు కావడంతో వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. ఆలయం తూర్పు వైపు అనివేటి మండపంలో భజన మండలి సభ్యుల కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాల్లో సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. శ్రీవారి దర్శనానంతరం వేలాది మంది భక్తులు స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వేసవి సెలవులు ముగిసే వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ ఇలాగే ఉండొచ్చని ఆలయ వర్గాలు భావిస్తున్నాయి.

క్లుప్తంగా

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్



కొయ్యలగూడెం పోలీస్‌స్టేషన్‌లో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

కొయ్యలగూడెం: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ జీజే విష్ణువర్ధన్ ఆదివారం తెలిపారు. ఎర్ర కాలువ నుంచి ఎర్రంపేట సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.

ఏఈవోల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం నూతన కార్యవర్గం

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలోని వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న వ్యవసాయ విస్తరణాధికారులు 12 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకుంటే వారికి గ్రేడ్-1 స్కేల్ ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించిందని ఏఈవోల రాష్ట్ర సంఘ అధ్యక్షుడు డి.వేణుమాధవరావు తెలిపారు. ఆదివారం తాడేపల్లిగూడెం పట్టణంలోని వ్యవసాయ పరీక్షా కేంద్రంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుమాధవరావు మాట్లాడారు. అనంతరం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నెక్కంటి రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎండిఆర్.శివప్రసాద్, కోశాధికారిగా బి.శ్రీనివాసరావు, సహాధ్యక్షుడిగా వి.గంగాధరరావు, ఉపాధ్యక్షుడిగా డి.నారాయణమూర్తి, కోరాడ అశోక్, డి.శేషుప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.రాధాకృష్ణ, కార్యదర్శిగా యు.మురళీకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా కే.శిరీష, ఎ.ప్రసాద్, జె.గౌరీ ప్రసన్న, ఆడిటర్‌గా ఎస్.శ్రీనివాసు, మరో ఆరుగురు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విచ్చలవిడిగా నాటు సారా అమ్మకాలు

ఆగిరిపల్లి: మండలంలో పలు గ్రామాల్లో విచ్చలవిడిగా నాటు సారా అమ్మకాలు జరుగుతున్నాయి. మండల కేంద్రమైన ఆగిరిపల్లి, మసీదు రోడ్డు, ఈదర ప్రధాన రహదారిలో, ఎస్‌ఏ పేట, నెక్కలం గొల్లగూడెంలో నాటు సారా అమ్మకాలు సాగుతున్నా అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదు. ఈ సారాకి బానిసై పలువురు అనారోగ్యం పాలవుతున్నారు. అధికారులు ఈ నాటు సారా అమ్మకందారులపై కొరడా ఝుళిపించాలని మహిళలు కోరుతున్నారు.

పారిజాతగిరికి బ్రహ్మోత్సవ శోభ

28 నుంచి ఉత్సవాలకు ఏర్పాటు



వెంకటేశ్వరస్వామి



పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం



జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం ఏరియల్ వ్యూ

జంగారెడ్డిగూడెం: తిరుమల తిరుపతి శ్రీవెంకటేశ్వర స్వామి ఏడుకొండల్లో వెలసినట్టే జంగారెడ్డిగూడెంలో పారిజాతగిరి వాసుడు ఏడుకొండలపై కొలువై ఉన్నాడు. భక్తుల అభీష్టాలు తీర్చే కల్పవల్లిగా, భక్తుల పాలిట కొంగుబంగారమై విరాజిల్లుతూ భక్తుల నిత్యపూజలందుకుంటున్నాడు. తిరుపతిలో జరిగే బ్రహ్మోత్సవాల తరహాలో ఇక్కడ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. జాతీయ రహదారి (516డి) ఆనుకుని ఆహ్లాదకరమైన పరిసరాలతో ప్రశాంత వాతావరణంలో ఉన్న శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిగాంచింది.

చిట్టియ్య అనే భక్తుడికి వేంకటేశుడు కలలో కనిపించి జంగారెడ్డిగూడెం ఉత్తరాన కొండల్లో తన పాదాలు వెలుస్తాయని ఆ ప్రాంతంలో ఆలయాన్ని నిర్మించాలని తెలిపారు. చిట్టియ్య అన్వేషించగా, ఉత్తర వైపున ఉన్న 7 కొండలలో 6వ కొండపై పారిజాతగిరి వృక్షం కింద స్వామి వారి పాదాలు గల శిలను గుర్తించి చిన్న ఆలయాన్ని నిర్మించారు. నాటి నుంచి భక్తుల అభీష్టాలు తీర్చుతూ ఆలయం పేరుగాంచింది. పాడిపంటలు కలిగిన ప్రదేశం కావడంతో గోకుల మని, పారిజాతగిరి వృక్షాలు కొండపై ఉండడంతో పారిజాతగిరి అని ప్రసిద్ధి గాంచింది.

ఆత్మప్రదక్షిణతో పుణ్యం

ఆగమశాస్త్రం ప్రకారం గిరిచుట్టూ ప్రదక్షిణలు చేయడం వల్ల పుణ్య ఫలం లభిస్తుందని చెబుతారు. పారిజాతగిరి అభివృద్ధి కమిటీ చైర్మన్ పేరిచర్ల జగపతిరాజు, కార్యదర్శి కాకాని శ్రీహరిరావు ఆధ్వర్యంలో దాతల సహకారంతో సుమారు 30 లక్షల రూపాయలు వెచ్చించి గోకుల పారిజాతగిరి ఆరు కొండల చుట్టూ గిరిప్రదక్షిణ తాత్కాలిక రోడ్డును నిర్మించారు. ఆరవ కొండకు ఎదురుగా కొద్ది దూరంలో గరుడకొండ ఉంది. గిరి ప్రదక్షిణ ద్వారా పుణ్యఫలితం లభిస్తుందని నమ్మకం. రాష్ట్రంలో ఏడుకొండలపైన వెలసింది తిరుమల వెంకటేశ్వరుడు కాగా, రెండోది పారిజాతగిరి వాసుడు. ఒక కొండ వెనుక వరుసగా ఏడు కొండలు ఉండగా ఒక కొండపై పారిజాతగిరి వాసుడు పాదపద్మాలు అవతరించాయి. పారిజాతగిరి వాసుడికి ఎదురుగా గరుడకొండ ఉంది. ఏడుకొండల్లో శేషాద్రి, వృషాద్రి, గరుడాద్రి, అంజనాద్రి, నారాయణాద్రి, వేంకటాద్రి, వృషభాద్రి ఉన్నాయి.

దాతల సహకారంతో రోడ్డు నిర్మాణం

పారిజాతగిరి ఆరు కొండల చుట్టూ సుమారు 3 కిలోమీటర్ల మేర రూ.30 లక్షలతో తాత్కాలిక రోడ్డును నిర్మించారు. దీనికి మద్ది ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి కూడా ఆర్థిక సహాయం అందించారు. కొండ చుట్టూ ప్రత్యేకంగా ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నారు. త్వరలో దాతల సహకారంతో శాశ్వత రోడ్డును నిర్మించనున్నారు. గిరి ప్రదక్షిణ రోడ్డు ఏర్పాటుపై భక్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ తరహా రోడ్డు అరుణాచలం, ద్వారకాతిరుమల, అన్నవరం, సింహాచలం, శ్రీకాళహస్తిలో మాత్రమే ఉన్నాయి. కాగా ఈ ఆలయంలో ప్రతి శనివారం అన్నదానం, మే నెలలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నాం. 31న స్వామి కల్యాణోత్సవం జరుగుతుంది.

– ఎం.రాంబాబు, కార్యనిర్వహణాధికారి, గోకుల తిరుమల పారిజాతగిరి, జంగారెడ్డిగూడెం

28 నుంచి బ్రహ్మోత్సవాలు

పారిజాతగిరిలో ఈ నెల 28వ తేదీ నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభంకానున్నాయి. 28వ తేదీ విశ్వక్సేన పూజ, అంకురార్పణ, వైనతేయ ప్రతిష్ఠ, 29న విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠ, కుంభ స్థాపన, నిత్యహోమం, సాయంత్రం శేషవాహన సేవ, 30న నిత్యహోమం, నీరాజనం, తీర్థప్రసాదగోష్ఠి, రాత్రి హనుమంతవాహన సేవ, 31న నిత్యహోమం, తీర్థప్రసాద గోష్ఠి, లోక కళ్యాణార్థం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ శ్రీనివాస కళ్యాణమహోత్సవం, రాత్రి అభినయ కూచిపూడి నాట్య అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి జానపద నృత్య ప్రదర్శన, అనంతరం చంద్రప్రభ వాహన సేవ, జూన్ 1న నిత్యహోమం, తీర్థప్రసాద గోష్ఠి, సాయంత్రం గరుడ వాహన సేవ, గ్రామోత్సవం, 2న నిత్యహోమం, వసంతోత్సవం, స్వామి వారి చక్రస్నానం, మహాపూర్ణాహుతి, రాత్రి కూచిపూడి జానపద నృత్య ప్రదర్శన, అనంతరం గజవాహన సేవ, ధ్వజఅవరోహణం, 3న ధృవమూర్తికి పంచామృతాభిషేకం, నవకలశ స్నపనం, రాత్రి ద్వాదశ ఆరాధన, ద్వాదశ కోవెల ప్రదర్శన, శ్రీపుష్పయాగంతో కార్యక్రమాలు పూర్తవుతాయి.

రైలు కిందపడి వ్యక్తి మృతి



మృతుడు

తాడేపల్లిగూడెం: బాదంపూడి–తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి (35) మృతి చెందినట్టు రైల్వే ఎస్‌ఐ జి.శ్రీహరి బాబు తెలిపారు. రైలు నుంచి జారిపడటం వల్ల ఈ ప్రమాదం సంభవించినట్టు భావిస్తున్నారు. పసుపు రంగు బనియన్, డార్కు బ్లూకలర్ జీన్స్ ప్యాంటు ధరించాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. వివరాలు తెలిస్తే 9490617090 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

స్వస్థలానికి చింతలయ్య మృతదేహం



గట్టిం మాణిక్యాలరావుకు వినతిపత్రం అందజేస్తున్న చింతలయ్య కుటుంబసభ్యులు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం కైకరం శివారు వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన పంతుల చింతయ్య జీవనోపాధి కోసం మలేసియా వెళ్లాడు. అనారోగ్యంతో అక్కడ మృతిచెందాడు. అతని మృతదేహాన్ని ఇండియాకు రప్పించడానికి అక్కడ కంపెనీ వారు రూ.6 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. కుటుంబ సభ్యులు మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి సాయంతో లయన్ గట్టిం మాణిక్యాలరావును కలిసి విజ్ఞప్తి చేశారు. ఆయన వెంటనే స్పందించి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా మృతదేహాన్ని ఇండియాకి రప్పించి స్వగ్రామానికి చేరేలా చేశారు. మాణిక్యాలరావుకు చింతలయ్య కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

కొబ్బరిపువ్వుతో జీవనోపాధి

యలమంచిలి: బతుకుదెరువు కోసం ఏదోక పని చేసుకోవాలి. కొందరు సీజనల్‌గా దొరికే పండ్లు, కాయలు అమ్ముతూ జీవనం సాగిస్తుంటారు. జాతీయ రహదారులు, ప్రధాన కూడళ్లు, రద్దీగా ఉండే ఆలయాలు వద్ద ఇలాంటి చిరు వ్యాపారులను నిత్యం చూస్తూ ఉంటాం. పాలకొల్లు శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి (పెద్ద గోపురం) వద్దకు నిత్యం భక్తులు వస్తుంటారు. ఆ ప్రదేశం అనేక చిరు వ్యాపారులకు ఉపాధి కల్పిస్తుంది. అందులో ఒకటి కొబ్బరి పువ్వు వ్యాపారం. యలమంచిలి మండలంలోని అడవిపాలెం గ్రామానికి చెందిన దేశినీడి మాణిక్యాలరావు పెద్ద గోపురం వద్ద కొబ్బరిపువ్వు అమ్ముతుంటారు. అతనిని పలకరిస్తే ఈ వ్యాపారంలో ఉండే కష్టనష్టాల్ని వివరించాడు.

మొలకెత్తిన కాయల నుంచే పువ్వు

కొబ్బరి పువ్వు రుచికి బాగుంటుంది. పశ్చిమ డెల్టా, కోనసీమ వాసులకు కొబ్బరిపువ్వు సుపరిచితం. ఇతర ప్రాంతాల వారికి మాత్రం ప్రత్యేకంగా ఉంటుంది. కొబ్బరిపువ్వు మొలకెత్తిన కొబ్బరి కాయ నుంచి మాత్రమే వస్తుంది. కొందరు పెద్ద రైతులు, వ్యాపారులు కొబ్బరికాయను రాశులుగా పోస్తుంటారు. ఆ రాశులలో కింద కాయలు మొలకెత్తుతుంటాయి. కొబ్బరి మొక్కలు అమ్మే వ్యాపారులు, రైతులు కూడా రాశుల్లో ఏరివేసిన మొలకెత్తిన కొబ్బరికాయలను అమ్మేస్తుంటారు. వారి వద్ద నుంచి కాయలను తెచ్చుకుని కొబ్బరిపువ్వు తీస్తుంటారు.



విక్రయానికి సిద్ధం చేసిన కొబ్బరి పువ్వు

కష్టమెక్కువ..లాభం తక్కువ

రైతులు, వ్యాపారులు వద్ద మొలకెత్తిన కొబ్బరికాయను సైజును బట్టి రూ.10 నుంచి రూ.13కు కొనాలి. తరువాత వలచి, కొట్టి పువ్వు తీయాలి. పువ్వు తీసిన తరువాత కొబ్బరి చెక్కలో ఇంకా కొంత కొబ్బరి ఉంటుంది. ఆ చెక్కలను ఎండబెట్టి, ముక్కలు తీసి కొబ్బరి నూనె తీయవచ్చు. ఇంత కష్టపడితే మార్కెట్‌లో కొబ్బరిపువ్వు సైజును బట్టి రూ.15 నుంచి రూ.20కి అమ్ముతారు. పువ్వును కాయ నుంచి వేరు చేసిన 12 గంటల్లో అమ్మేయాలి. లేదంటే వాసన వస్తుంది. ప్రతి రోజు తెల్లవారుజామునే 5 గంటలకు నిద్రలేచి అందరూ కష్టపడి కొబ్బరిపువ్వు తీస్తారు.

రోజు కూలి గిట్టుబాటైతే చాలు



గతంలో సైకిల్‌పై కొబ్బరిపువ్వు పెట్టుకుని ఊరూరా తిరిగి అమ్మేవాళ్లం. ఇప్పుడు మోపెడ్‌పై తెచ్చి అమ్ముతున్నాం. ఎండ ప్రతాపం ఉన్నా లెక్కచేయకుండా వ్యాపారం చేస్తాం. రోజు కూలి డబ్బులు గిట్టుబాటు అయితే చాలు అన్నట్టుగా ఉంటుంది మా వ్యాపారం.

దేశినీడి మాణిక్యాలరావు, విక్రయదారుడు

● కళకళలాడిన బీచ్‌లు



మొగల్తూరు: మండలంలోని కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లు ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. ఆదివారం ఉదయం నుంచి వాతావరణం అనుకూలంగా ఉండటంతో పలు ప్రాంతాల నుంచి బీచ్‌లకు వచ్చే పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొంది. సముద్రస్నానం అనంతరం.. తీరంలోని ఆలయాలను సందర్శించారు.

లైంగిక వేధింపుల కేసులో నిందితుడి అరెస్టు

తణుకు: బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన తణుకు పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానిక ఎన్టీఆర్ పార్కు సమీపంలో ఉంటున్న చదలవాడ తిమోతి తన ఇంటి సమీపంలో ఉంటున్న ఏడేళ్ల బాలిక ఆడుకుంటూ ఉండగా ఇంట్లోకి పిలిచాడు. ఆమెపై లైంగిక వేధింపులకు పాల్పడగా తప్పించుకుని ఇంటికి చేరుకుంది. బాధిత బాలిక విషయాన్ని ఇంట్లో చెప్పడంతో తిమోతిను స్థానికులు చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారుచౌకగా చేపలు

● చేప రూ.10 నుంచి రూ. 25కు విక్రయం

● ప్రతికూల వాతావరణంతో మొప్పలు తేలేసిన చేపలు

ఆకివీడు: ప్రతికూల వాతావరణం వల్ల చేపలు మత్స్యవాత పడడంతో ఆకివీడు మార్కెట్‌ను చేపలు ముంచెత్తాయి. ఆకివీడులోని హోల్‌సేల్ మార్కెట్‌కు ఆదివారం అధిక సంఖ్యలో మినీ లారీలు చేపల లోడుతో వచ్చాయి. స్థానికంగా మార్కెట్ లేకపోవడంతో వీటిని సైజును బట్టి రూ.10 నుంచి రూ.25కు విక్రయించారు. దీంతో స్థానికులు ఎగబడి చేపల్ని కొన్నారు. మరికొన్ని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. నాలుగు రోజుల నుంచి ప్రతికూల పరిస్థితులతో చేరువుల్లో చేపలు ఉక్కిరి బిక్కిరవుతున్నాయి. ఆక్సిజన్ అందక మొప్పలు తేలేసి చనిపోతున్నాయి.



ఆకివీడు చేపల మార్కెట్‌కు తీసుకొచ్చిన చేపలు

పెద్దింట్లమ్మా.. కరుణించమ్మా..

కైకలూరు: అమ్మా.. పెద్దింట్లమ్మ తల్లీ.. నీ చల్లని దీవెనలు అందించమ్మా.. అంటూ భక్తులు అమ్మను వేడుకున్నారు. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవాలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. సెలవు దినం కావడంతో ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి భారీగా భక్తులు విచ్చేశారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. మహిళలు పాల పొంగళ్లను సమర్పించారు. కోనేరులో స్నానాలు చేసి తలనీలాలు సమర్పించారు. ఇటీవల సర్కారు కాల్వపై పెద్దింట్లమ్మ వారధి నిర్మాణం చేయడంతో ఎలాంటి రుసుం చెల్లించకుండా నేరుగా ఆలయం వద్దకు వాహనాల ద్వారా భక్తులు చేరారు.



కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద క్యూలైన్‌లో భక్తులు

నేత్ర పర్వంగా నాగేంద్ర స్వామి ఉత్సవాలు



వలసపల్లిలో నాగేంద్రస్వామికి భక్తుల పూజలు

వలసపల్లి(ముసునూరు): ప్రతి ఏటా వలసపల్లిలో నాలుగు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహించే శ్రీనాగేంద్ర స్వామి ఉత్సవాలు ఈ ఏడాది నేత్ర పర్వంగా జరిగాయి. వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం వలసపల్లిలో ప్రారంభమైన నాగేంద్రస్వామి ఉత్సవాలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ప్రతి రోజూ ఆలయంలో తెల్లవారుజామునే స్వామి వారి మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, ప్రజల దర్శనానికి అవకాశం కల్పించారు. పలువురు భక్తులు పుట్టలో పాలు పోసి, తమ పిల్లల చెవులకు పోగులు కుట్టించి, సదా కాపాడమని వేడుకున్నారు. ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 3,000 మంది భక్తులకు అన్న సంతర్పణ చేశారు. దూర ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు హాజరై, రాత్రి పొద్దుపోయేవరకూ నాగేంద్ర నామం జపిస్తూ.. విశేష పూజలు చేసి, దీపారాధనలు చేశారు. రాత్రి పూట నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

100 కేజీల పులిహోర కుంభం



అమ్మవారికి పులిహోర కుంభం

భీమవరం (ప్రకాశంచౌక్): మెంటేవారి తోటలోని శ్రీవిజయ కనక దుర్గ శ్రీచక్ర సహిత బాలా త్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా 100 కేజీల పులిహోర కుంభంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వలవల సూర్యనారాయణ, మహాలక్ష్మి దంపతులచే 100 కేజీలు పులిహోర కుంభం అమ్మవారికి సమర్పణ చేశారు.

వేసవి దుక్కులతో పంటకు మేలు

పాడి - పంట



గోపవరంలో వేసవి దుక్కు దున్నుతున్న రైతు

ముసునూరు: మెట్ట ప్రాంతాల్లో వర్షాధార పంటలు పండించే భూములన్నింటిలో వేసవి(లోతు) దుక్కులు ఎంతో ప్రయోజనకరం. దుక్కి లోతు పండించే పంటలపై ఆధారపడి ఉంటుంది. ప్రతి మూడేళ్లకు ఒకసారి పెద్ద మరతో 30 సెం.మీ లోతు వరకు దుక్కు చేయడం మంచిది. ప్రతి ఏటా వర్షాలను బట్టి భూమిని 15–20 సెం.మీ లోతు వరకు దున్నుకోవాలి. సాధారణంగా తల్లి వేరు వ్యవస్థ, పీచు వేరు వ్యవస్థ ఉన్న పంటలకు తుక్కువ లోతు దుక్కి సరిపోతుంది. తేలికపాటి నేలల్లో 1–3 సార్లు దున్నాలి. కలుపు మొక్కలు, పంటల అవశేషాలు ఎక్కువగా ఉంటే కనీసం మూడు దఫాలుగా దున్నాలి.

వేసవి దుక్కులకు అనుకూల పరిస్థితులు

● భూమిలో నిల్వ ఉంచుకునే తేమ 25 నుంచి 50 శాతం ఉంటే అది దుక్కులకు పూర్తి అనుకూలం.

● భూమిలో తేమ తక్కువ ఉన్నప్పుడు దుక్కి చేయకూడదు. దీనివలన భూమి గుల్ల బారదు.

● భూమిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు నాగలికి మట్టి అంటుకుంటుంది. కింద ఉన్న మట్టి గట్టిపడి, భూమిలో గట్టి పొరలు ఏర్పడతాయి.

వేసవి దుక్కులతో ప్రయోజనాలు

● వేసవి దుక్కుల వలన నేల గుల్ల బారుతుంది. తదుపరి వచ్చే వర్షపు నీరు వృథా కాకుండా సద్వినియోగం చేసుకోవచ్చు.

● తగినంత తేమ ఉన్నప్పుడు నేలను లోతుగా వాలుకు అడ్డంగా దున్నడం వలన నేల కోతను నివారించి, భూమి పైపొర భూసారాన్ని కొట్టుకుపోకుండా అరికట్టవచ్చు.

● లోతు దుక్కుల వలన భూమిలో నీరు ఉండి, తేమ శాతం పెరగడం వలన సేంద్రియ పదార్థాలు త్వరగా కుళ్ళి పోషకాల రూపంలో అందుబాటులోకి వస్తాయి.

● భూమిని ఒక అడుగు లోతు వరకు దున్నుకుంటే విత్తనం మొలకెత్తి వేర్లు సులభంగా భూమిలోకి దిగి భూమిలో ఉండే పోషకాలను గ్రహించి, మొక్క పెరుగుదలకు తోడ్పడుతుంది.

● పంట పొలాల్లో లోతు దుక్కులు దున్నడం వల్ల భూమిలో దాగి ఉన్న చీడ పీడలు, పురుగులు, బ్యాక్టీరియా, శిలీంద్రాలు, సిద్ధబీజాలు, కలుపు మొక్కల విత్తనాలు ఎండ వేడికి నశిస్తాయి. పక్షులు తినేయడంతో తెగుళ్ళ బెడద తప్పుతుంది.

● పొలంలో మట్టి గడ్డలు తొలగిపోయి, మెత్తని మట్టి ఏర్పడి పంట త్వరగా పెరిగేందుకు దోహదపడుతుంది. దీంతోపాటు సకాలంలో కలుపు నివారణా జాగ్రత్తలు తీసుకుంటూ, పంటలు పండించి, చిన్న, సన్నకారు రైతులు మేలు పొందవచ్చు.

భూసారం పెంచుకోవాలి



పంటలను బట్టి వేసవి దుక్కులను చేసి భూసారం పెంచుకోవాలి. వ్యవసాయ శాఖ ద్వారా లభించే సలహాలు, సూచనలు పాటించడం ద్వారా వ్యవసాయాన్ని మరింత సులభతరం చేసుకోవాలి. సబ్సిడీపై వనరులు పొంది రైతులు లాభసాటి వ్యవసాయం చేయాలి.

నందిపాము మధుమోహన్, మండల వ్యవసాయాధికారి

క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



వరిఘేడులో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న సేవా సమితి సభ్యులు

అత్తిలి: త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం అత్తిలి మండలం వరిఘేడు గ్రామంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు.ఆత్మ, జీవాత్మ, పరమాత్మలను తెలుసుకోవడం ద్వారా మధ్యాత్మ, ఆరాధనతో ధర్మస్థాపన జరుగుతుందని, ఇదే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, జి.నాగేశ్వరరావు లోకేష్, వాసుదేవరావు, రామకృష్ణ, సత్యనారాయణ, హనుమంతరావు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నులు, పుస్తకాల అందజేత

ఇరగవరం: మండలంలోని ఓగిడి గ్రామంలో ఆదివారం చైనెడ్ మినిస్ట్రీ వారు పాస్టర్ నల్లి అనిల్ ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, విద్యా సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సహాయంతో పాటు దాతలు అందిస్తున్న సౌకర్యాలు వినియోగించుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రవేశ పరీక్ష



వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఐఐటీ ప్రవేశ పరీక్షరాయడానికి వచ్చిన విద్యార్థులు

తాడేపల్లిగూడెం: కేంద్ర ప్రభుత్వ సాంకేతిక విద్యాసంస్థల్లో ప్రముఖమైన ఐఐటీల్లో ప్రవేశానికి గాను ఆదివారం పెదతాడేపల్లి వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాశారు. 250 మంది విద్యార్థులకు గాను 249 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు, పరీక్షా కేంద్రం కో ఆర్డినేటర్ నటరాజ్, సిస్టం అడ్మిన్ కొల్లా సురేష్ పాల్గొన్నారు.

1న హనుమాన్ పతాక వాహన యాత్ర

తాడేపల్లిగూడెం (టీఓసీ): హనుమాన్ జయంతి సందర్భంగా జూన్ 1న హనుమాన్ పతాక వాహన యాత్రలో నిర్వహిస్తున్నట్టు హౌసింగ్ బోర్డు కాలనీ ఎంట్రన్స్‌లోని శ్రీ దక్షిణముఖ అభయ ఆంజనేయ స్వామి ఆలయం నిర్వాహకులు ఆకుల నరసింహమూర్తి వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైశాఖ బహుళ దశమి పర్వదినం పురస్కరించుకుని ఆంజనేయ స్వామికి రుద్రాభిషేకం, అదే రోజు సాయంత్రం అప్పాల హోమం, రాత్రి సువర్చల సుందర హనుమాన్ కల్యాణం, పతాక వాహన యాత్రలు జరుగుతాయని వివరించారు.

దానేశ్వరమ్మకు ప్రత్యేక పూజలు



మామిడి పండ్లతో అలంకరించిన దువ్వ దానేశ్వరి

తణుకు టౌన్: వైశాఖ మాసం సందర్భంగా తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో ఉన్న శ్రీ దానేశ్వరి అమ్మవారిని భక్తులు మామిడి పండ్లతో అలంకరించారు. ఆదివారం దువ్వ దానేశ్వరి ఆలయంలో అమ్మవారిని గ్రామానికి చెందిన టీఎస్‌బీ సుబ్రహ్మణ్యం వివిధ రకాల మామిడి పండ్లతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ముత్యాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్యసేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే ఇంటింటికి వైద్యసేవల కార్యక్రమంలో 8 మంది వృద్ధులకు వైద్య సేవలు అందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.కరుణాకర్ చౌదరి తెలిపారు. ప్రముఖ నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా జనరల్ వైద్యులు సుంకవల్లి నీలు మహేంద్ర, సాతులూరి అనుస్మితలు తణుకు, పరిసర గ్రామాల్లోని మంచం నుంచి లేవలేని వృద్ధుల వద్దకు వెళ్లి అవసరమైన వైద్య పరీక్షలు చేసి వైద్య సూచనలు, సలహాలు అందించారు. సంఘ సభ్యులు గంధ్రోతు వీరవెంకట సత్యనారాయణ ఆర్థిక సహాయంతో మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, నాదెళ్ల కృష్ణానందం తదితరులు పాల్గొన్నారు.

ఎవరి లెక్కలు వారివే

- పెరిగిన పోలింగ్ ఎవ్వరికి వరం?
- గెలుపోటములను నిర్దేశించేది మహిళలే
- పట్టణంలో విస్తృత చర్చ



తాడేపల్లిగూడెం: గడచిన రెండు అసెంబ్లీ ఎన్నికల కంటే ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో పోలింగ్ శాతం బాగా పెరిగింది. ఈ పోలింగ్ లో పురుషుల కంటే మహిళలు 1565 మంది అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఐదేళ్ల కాలంలో మహిళల స్వయం సమృద్ధికి, ఆర్థిక స్వావలంబనకు సంక్షేమ పథకాల అమలు, ఆర్థిక పరమైన చేయూత, సామాజిక వర్గాల వారీగా ఇంటిపట్టునే ఉన్న మహిళలకు ఉపాధి కలిగించడానికి కాపునేస్తం, ఈబీసీ, నేస్తం వంటి పథకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసింది. డ్వాక్రా సంఘాలకు రుణ మాఫీతో పాటు వడ్డీరాయితీ ఇవ్వడం, పాతబకాయిలు విడతలవారీగా ప్రభుత్వమే తీర్చింది. దీంతో మహిళలు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం, అల్పాదాయ వర్గాలు, పేద వర్గాలు నిలదొక్కుకొనేందుకు వీలుగా బిడ్డల విద్యకు అమ్మ ఒడి, పండుటాకులకు గడప వద్దకే తీసుకెళ్లి ఠంచన్‌గా పింఛన్ అందించడం వంటివి మునుపెన్నడూ జరగని విధంగా జరిగాయి. ఈ అభిమానం చాటుకొనే అవకాశం ఓటు ద్వారా రావడంతో కృతజ్ఞతను తెలియచేయడానికి మహిళలు ఉదయాన్నే క్యూ లైన్లలో బారులు తీరడం వల్ల పెరిగిన పోలింగ్ వైసీపీకి కలిసొచ్చే వాతావరణం ఉంది. ఇదే విషయంపై ప్రస్తుతం విస్తృత చర్చ సాగుతోంది. 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌తో పోల్చుకుంటూ గెలుపుపై అంచనాలతో చర్చ సాగిస్తున్నారు.

పెరిగిన పోలింగ్ శాతం

తాజాగా ముగిసిన పోలింగ్‌లో నియోజకవర్గంలో 81.86 శాతం మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 214985 ఓట్లకు గాను , 175990 మంది ఓటు వేశారు. పురుషులు 87208 మంది ఓట్లు వేయగా, మహిళలు 88773 మంది ఓట్లు వేశారు. పురుషుల కంటే 1565 మంది మహిళలు అధికంగా ఓటు వేశారు. పట్టణంలో మాత్రమే తక్కువ పోలింగ్ జరిగింది. ఇక్కడ 87557 మంది ఓటర్లకుగాను 65935 మంది మాత్రమే ఓటు వేశారు. కేవలం 75.30 శాతం మాత్రమే పోలింగ్ జరిగింది. పెంటపాడు మండలంలో అత్యధికంగా ఓట్లు వేశారు. ఇక్కడ 56742 మందికి గాను , 49143 మంది ఓటు వేశారు. 86.60 పోలింగ్ శాతం నమోదైంది. తాడేపల్లిగూడెం మండలంలో 86.17 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ మొత్తం ఓటర్లు 70686 మంది ఓటర్లకు గాను 60912 మంది ఓట్లు వేశారు. మొత్తంగా గడచిన రెండు అసెంబ్లీ కంటే పెరిగిన పోలింగ్ ఏ పార్టీకి వరమనే చర్చ నడుస్తోంది. 2014 ఎన్నికలో 157480 మంది ఓటు హక్కు వినియోగించుకోగా, చెల్లిన ఓట్లు 155973, 2019 ఎన్నికలో 167932 మంది ఓటు వేశారు. వీటిలో చెల్లిన ఓట్లు 165981. ఈ మేరకు మూడు ఎన్నికల పోలింగ్‌ను బేరీజు వేసుకుని, విశ్లేషణలతో కాలక్షేపం చేస్తున్నారు.

అపూర్వ సమ్మేళనం



జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు 1996–2001 బ్యాచ్ ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ ఉన్నత చదువులు చదివారు. ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు. వివిధ రంగాలలో స్థిరపడ్డారు. వివిధ ప్రాంతాల నుంచి ఈ సమ్మేళనానికి హాజరయ్యారుయారు. చిన్ననాటి మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. చదివిన తరగతి గదులను సందర్శించారు. తమకు విద్యను బోధించిన గురువులను స్మరించుకున్నారు.

ఘనంగా మేడపాడు గ్రామ దేవతల జాతర

యలమంచిలి: మేడపాడు గ్రామ దేవతలు వెంకమ్మ, కనకదుర్గమ్మ, జువ్వాలమ్మ అమ్మవార్ల జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, జాతర నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం, ఆదివారం జాతర నిర్వహించారు. సోమవారం రాత్రి బలిహరణ, ఊయల ఉత్సవం నిర్వహించి అమ్మవార్లను ఆలయ ప్రవేశం చేస్తారు. మంగళవారం నుంచి ఐదు రోజులపాటు తీర్థ ఉత్సవాలు జరుగుతాయి. జూన్ 2న ఆదివారం మాంసాహారంతో అన్నసమారాధన నిర్వహించడంతో జాతర ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు, జాతర ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవార్ల ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.



ప్రత్యేకాలంకరణలో వెంకమ్మ

రేపటి నుంచి హనుమత్ జయంతి ఉత్సవాలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్ వద్ద ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో జూన్ 1న హనుమత్ జయంతి సందర్భంగా ఈ నెల 28 నుండి జూన్1 వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ సేవా సమితి సభ్యులు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రమణ గురుస్వామి యాజ్ఞీకంలో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాలు ఐదు రోజులు ఉదయం పంచముఖ ఆంజనేయస్వామికి గందసిందూరం, తమలపాకులు, తులసిదళములతో సహస్రనామ పూజలు నిర్వహించబడతాయన్నారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు పూజా ద్రవ్యాలు నిమిత్తం రూ. 558 లు రసీదు తీసుకోవాలన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం తీర్థప్రసాద వితరణ ఉంటుందని వివరించారు.



శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి

పెరుగుతున్న కుక్కల బెడద

నరసాపురం రూరల్ : నరసాపురం నియోజకవర్గంలో కుక్కలు కరవడంతో గాయాలపాలై ఆసుపత్రుల పాలవుతున్న వారి సంఖ్య పెరుగుతుంది. గ్రామాల్లోని చిన్నారులు, వృద్ధులు, మహిళలతో పాటు కోళ్లు, మేకలపై తరచూ కుక్కలు దాడి చేస్తున్నాయి. అయితే ఈ కుక్కలను నిర్మూలించేందుకు పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లోనూ ఎక్కడ చూసినా వీధికుక్కలు బాటసారులను, వాహనాలపై వెళుతున్న వారిపై దాడి చేసిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. స్థానికులు ఆయా గ్రామాల పంచాయతీ సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడంతో పలు చోట్ల గ్రామస్తులు కుక్కలను మట్టు బెడుతున్న సంఘటనలూ చోటు చేసుకుంటున్నాయి. కొప్పర్రు, మల్లవరం, వేములదీవి, లక్ష్మణేశ్వరం, ఎల్బీచర్ల, పెదమైనవానిలంక గ్రామాల్లో పలువురు వీధికుక్కల బారిన పడిన సంఘటనలు కూడా తరచూ చోటు చేసుకున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు.



లక్ష్మణేశ్వరంలో సంచరిస్తున్న కుక్కలు

ఆరోగ్యశ్రీ సేవలకు అంతరాయం లేకుండా చూడాలి

భీమవరం: ఆరోగ్యశ్రీ సేవలకు అంతరాయం లేకుండా చూడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని పార్టీ జిల్లా కమిటీ సమావేశం జేఎవీ గోపాల్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశానికి హాజరైన మంతెన సీతారామ్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ట్రస్టు ఆసుపత్రులకు చెల్లించాల్సిన వందల కోట్ల రూపాయల బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించి రోగులను ఆదుకోవాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరామ్ మాట్లాడుతూ జిల్లాలో కాలుష్యాన్ని అరికట్టి పరిశుభ్రమైన తాగునీరు అందించాలన్నారు. తేమ శాతం పేరుతో ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న అవకతవకలను అరికట్టి రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కరెంటు కోతలు అరికట్టాలని దళితులకు, క్రిస్టియన్ల శ్మశాన వాటిక సమస్యలు పరిష్కరించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చి రుణాలివ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కౌరు పెద్దిరాజు, కేతా గోపాల, బి.వాసుదేవరావు, డి.కల్యాణి, పీవీ ప్రతాప్ పాల్గొన్నారు.

అభయ గణపతి స్వామికి పంచామృత అభిషేకాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వైశాఖ బహుళ చవితి (సంకష్టహర చవితి) పురస్కరించుకుని పట్టణంలోని రామచంద్రరావుపేట శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలోని శ్రీ అభయ గణపతి స్వామికి ఆదివారం అర్చకులు ఆదూరి సాయికిరణ్ బ్రహ్మత్వంలో పంచామృత అభిషేకాలు, సహస్రనామార్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి శ్వేతార్క పుష్పాలు, దూర్వాంకురాలతో అష్టోత్తర శతనామ పూజలు చేశారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు, భక్తులు పాల్గొన్నారు.

13 నుంచి శంకరమఠంలో రుద్రయాగం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లోక కల్యాణార్థం పట్టణంలోని శంకరమఠంలో జూన్ 13న జ్యేష్ఠ శుద్ధ సప్తమి నుంచి 17 ఏకాదశి వరకు రుద్రయాగం నిర్వహించనున్నారు. వివిధ పుణ్య క్షేత్రాల నుంచి వేద పండితులు యాగంలో పాల్గొనున్నారు. ప్రతిరోజూ శతరుద్రీయహవనం, రుద్ర క్షమార్చన, ఇతర అధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని శంకరమఠం సభ్యులు వివరించారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. అమ్మవారి దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

జగన్ మరోసారి ముఖ్యమంత్రి కాబోతున్నారు

నరసాపురం: రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ప్రభంజనం కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఇటీ విభాగం కన్వీనర్ బుడితి సుమన్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలకు ప్రజలు మద్దతుగా నిలిచారని చెప్పారు. కూటమి నేతలు పెట్టుకున్న భ్రమలు మరో 10 రోజుల్లో తొలగిపోతున్నాయని చెప్పారు. సంపూర్ణ మెజార్టీతో ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి అధికార పీఠంపై కూర్చోబోతున్నారని జోష్యం చెప్పారు.

యోగాసనాలు, ఓంకార విశిష్టతను గుర్తించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): యోగాసనాలు, ఓం కార విశిష్టతను గుర్తించాలని పలువురు ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ పేర్కొన్నారు. పట్టణంలోని వాకర్స్ అసోసియేషన్ భవనంలో అధ్యక్షులు దూలం నాగరాజు అధ్యక్షతన ఆదివారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. వక్తలు మాకా శ్రీనివాసరావు, మల్లారెడ్డి సారధి, ప్రవా శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ఆరోగ్యం, సేవ, ఆధ్యాత్మిక చింతన, ఓం కార విశిష్టత-సైన్సులపై అవగాహన కల్పించారు. డాక్టరేట్ పొందిన మాజీ కార్యదర్శి కోపెల్ల శ్రీనివాస్‌ను సత్కరించారు. కేవీ చలం, వనచర్ల నాగేంద్ర ప్రసాద్, రాగిరెడ్డి ప్రసాద్, యోహాను, నూకరాజు, వనచర్ల విజయలక్ష్మి, ఉదయ కుమారి, చల్లా ఇందిరాకుమారి, చంటమ్మ, నాగ అనుపమ, గాయత్రి పాల్గొన్నారు.



కోపెల్ల శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు



తాడేపల్లిగూడెంలో వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులు



అత్తిలిలో విద్యార్థులకు పఠనా నైపుణ్యాలపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మనిషి అవయవా ల్లో మెదడు అతి శక్తివంతమైనదని, మేథస్సు ను సక్రమంగా ఉపయోగిస్తే ఎన్నో అద్భుతమైన ఆవిష్కరణలు వెలికి తీయవచ్చని అంతర్జాతీయ సేవా సంస్థ గ్రామీణ్ ఫౌండేషన్ నిపుణులు కేవీ సత్యప్రకాశ్ తెలిపారు. తాడేపల్లిగూడెం గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ఆదివారం గ్రంథాలయాధికారి వి.శ్రీనివాస్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. విశ్రాంత అధ్యాపకులు గిరికపాటి బాపయ్యశర్మ, ప్రత్తి వీరాస్వామి, సత్యంలు సైన్స్ పరిజ్ఞాన విషయాలను, లెక్కలు, చిత్రలేఖనం, స్పోకెన్ ఇంగ్లీషు, ఎల్‌ఐసీ ఉద్యోగి రామాంజనేయులు ఆధ్యాత్మిక విషయాలను, జనార్దనరావు ద్వారా పిల్లలకు నీతి కథలు, మాస్టార్ బడుగు సుధాకర్ విద్యార్థులకు యోగా నేర్పించారు.

అత్తిలిలో...

అత్తిలి: వేసవి శిక్షణలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో ఆదివారం రిటైర్డు గ్రంథాలయాధికారి గంధం శేషవేంద్రరావు విద్యార్థులకు పఠనా నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చారు. స్వాతంత్ర్య సమర యోధుల జీవిత చరిత్రలను, విద్యార్థులకు ఇష్టమైన కథల పుస్తకాలను చదివించారు.కార్యక్రమంలో రిసోర్సుపర్సన్ కె కోమలి, విజయకుమార్, రవిశంకర్, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు పాల్గొన్నారు.

ఆరవల్లిలో

వేసవి విజ్ఞాన శిక్షణలో భాగంగా ఆరవల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. యోగాసనాలు వేయించారు. రిసోర్సుపర్సన్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ144వ నెలవారీ కార్యక్రమ సాహితీ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురు రోడ్డులోని గీతా మందిరంలో రంగస్థల కళాకారులు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కళాకారులు వెంకటేశ్వరరావు, నాగమణి, తదితరుల ద్వారా సత్య హరిశ్చంద్ర నాటకం నుంచి కాటికాపరి దృశ్యాలు ప్రదర్శించారు. నటులు కోపల్లె శ్రీనివాస్‌కు గౌరవ సత్కారం, పౌరాణిక నటులు పిప్పిరిశెట్టి వేంకటేశ్వరరావుకు కళా సత్కారం, సాహితీ సేవకులు డాక్టర్ సుంకర గోపాల్‌కు ఉద్యోగ సేవా పురస్కారం, కళాకారులు పిల్యాణం గంగాధరరావుకు ఆర్థిక సత్కారం చేశారు. సంఘ నిర్వాహకులు సూరంపూడి వెంకట రమణ, చింతకాయల వంశీకృష్ణ, తగరంపూడి మురళీకృష్ణ, మాసా బాబురావులు పర్యవేక్షించారు.



సత్య హరిశ్చంద్ర నాటికలో సన్నివేశం

కుంగుతున్న గోదావరి గట్టు రోడ్డు

నరసాపురం: పట్టణంలోని గోదావరిగట్టు రోడ్డు ధ్వంసమవుతోంది. పడవలరేవు నుంచి కొండాలమ్మగుడి వరకూ రోడ్డుకు పలు చోట్ల గోతులు పడ్డాయి. రోడ్డు చాలాచోట్ల కుంగిపోయింది. దీంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డు మీదుగా నిత్యం వేలాదిమంది ప్రయాణిస్తుంటారు. ముఖ్యంగా మార్నింగ్ వాక్ చేసేవారితో పాటు సాయంత్రం వేళలో గోదావరి తీరానికి విహారానికి పెద్దసంఖ్యలో జనం వస్తుంటారు. రోడ్డు సవ్యంగా లేకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అయితే మున్సిపల్ అధికారులు రోడ్డు మరమ్మతులపై దృష్టిపెట్టడంలేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టిపెట్టి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.



ధ్వంసమైన గోదావరిగట్టు రోడ్డు

మానవత నూతన కార్యవర్గం ఎన్నిక

పాలకొల్లు అర్బన్: మానవత స్వచ్ఛంద సంస్థ, పాలకొల్లు శాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం రోటరీ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా మాంటిస్సోరీ స్కూల్ అధినేత మద్దాల వాసు, కార్యదర్శిగా విజయా ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణ, కోశాధికారిగా ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్ ఎన్నికయ్యారు. వీరు ఈ ఏడాది జూలై నుంచి వచ్చే ఏడాది జూన్ 30 వరకు పదవిలో కొనసాగుతారు. మానవత మండల శాఖ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా కొనసాగుతున్న మానవత సేవా కార్యక్రమాల్లో పాలకొల్లు శాఖను ఉన్నత స్థితికి తీసుకురావాలని కోరారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జూన్ 23వ తేదీన నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ ముత్యాల రామారావు, సహాయ కార్యదర్శి గోపి, సభ్యులు బొక్కా గంగాధర్, చిలుకూరి భీమన్న, షేక్ పీర్ సాహెబ్, సోమంచి శ్రీనివాస శాస్త్రి, ఎంఆర్‌కే రాజు, వారధి వెంకటరమణ, అత్యం ఆది శేషారావు, బోళ్ల శ్రీనివాస్, ఫణీంద్రుడు, తమ్మినీడి మురళీకృష్ణ, బోళ్ల వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



మానవత నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న మానవత సభ్యులు

పల్లంలో హైబ్రీడ్.. మెట్టలో సేంద్రియం

ఆకివీడు: ఖరీఫ్ సాగులో అధిక దిగుబడులనిచ్చే హైబ్రీడ్ వంగడాలతో పాటు, స్థానిక మార్కెట్‌లో అధిక లాభాల్నిచ్చే ఆర్గానిక్ పద్ధతిలో దేశీయ వంగడాల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. గోదావరి, కృష్ణా నదులకు శివారు ప్రాంతంగానూ, పశ్చిమ డెల్టా ప్రాంతానికి శివారు ప్రాంతంగా ఉన్న ఉండి నియోజకవర్గంలో మెట్ట, పల్లపు భూములు ఉన్నాయి. పల్లపు ప్రాంతంలో హైబ్రీడ్ వంగడాల సాగు, మెట్ట ప్రాంతంలో ప్రకృతి సాగు పద్ధతులతో వరి పండించడం ద్వారా లాభాలు పొందే అవకాశం ఉంటుందని పలువురు వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

హైబ్రీడ్ వంగడాలు

ఖరీఫ్ సాగులో హైబ్రీడ్ వరి వంగడాలైన ఎంటీయూ 1318, 1061, 1064, స్వర్ణ వంగడాలతో పాటు కొత్త రకం వంగడం ఎంటీయూ 1310 విత్తనాల్ని సాగు చేయడం ద్వారా మంచి ఫలితాలను పొందవచ్చునని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఎంటీయూ 1318 వంగడాన్ని త్వరితగతిన సాగు చేయడం ద్వారా మంచి లాభాలను పొందవచ్చంటున్నారు. 160 రోజుల పంట కాల వ్యవధిలో వరి మొక్క పడిపోకుండా అధిక దిగుబడుల్ని ఇస్తుంది. మధ్యస్థ సన్నాలుగా ఉన్న ఈ రకం స్థానికంగా ప్రజల ఆహారానికి అనువుగా ఉంటుంది. స్వర్ణ రకం వంగడం కూడా అధిక దిగుబడుల్ని ఇస్తుంది. స్థానిక మార్కెట్‌లోనూ, స్థానికంగా ప్రజలు భుజించడానికి ఇష్టపడే ఈ రకం వంగడం ముతక బియ్యాన్ని ఇస్తుంది. మధ్యస్థ సన్నాలుగా ఉన్న ఎంటీయూ 1061, 1064తో పాటు 1318, స్వర్ణ, సంపద స్వర్ణ రకం వంగడాల్ని మాత్రమే ప్రభుత్వం లెవీగా బియ్యాన్ని సేకరిస్తుంది. బీపీటీ 5204 రకం వంగడం సోనామసూరుని పోలిన విధంగా బియ్యం ఉంటున్నాయి. దీనిని కూడా ఖరీఫ్‌లో సాగు చేసుకునే అవకాశం ఉంది. వీటితో పాటు పలు గ్రామాల్లో ఉప్పునీటిని తట్టుకునే విధంగా ఎంసీఎం 100 వంగడం కూడా సాగుకు అనుకూలంగా ఉంటుంది.

దేశీయ వంగడాలకు గిరాకీ

స్థానిక మార్కెట్‌లో ప్రకృతి సాగులో దేశీయ వంగడాల్ని సాగు చేయడం ద్వారా వాటి బియ్యాన్ని ప్రజలు అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. మెట్ట ప్రాంతంలో సాగుకు అనువైన దేశీయ వంగడాలు చింతలూరు సన్నాలు, నవారా, బహురూపితో పాటు చిట్టి ముత్యాలు, రెడ్‌బాసుమతి, బ్లాక్‌రైస్, జీరా సాంబా రకం వంగడాలు అనువైనవిగా అనుభవం కలిగిన రైతులు చెబుతున్నారు. జీవామృతం, గోఆధారిత సాగులో పండించడం ద్వారా ఈ రకం బియ్యానికి మంచి డిమాండ్ ఉంది. ప్రకృతి సేద్యంతో సాగు చేసే వంగడాలకు సంబంధించిన బియ్యం మంచి ఆరోగ్యానికి దోహదపడుతున్నాయంటున్నారు.



సాగు చేసిన ఎంటీయూ 1318 వంగడం